సాక్షి విశాఖపట్నం

సోమవారం। 13। జనవరి। 2025



చిన్నారులు, యువత ఆటపాటలు.. పండు వెన్నెలను పోలిన వెండి ముగ్గులు.. మధ్యలో గొబ్బెమ్మలు.. గంగిరెద్దుల విన్యాసాలతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. హరిదాసుకు కోలాట సంఘ సభ్యులు స్వాగతం, తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



నా చిన్నతనంలో పెద్ద పండగ వచ్చిందంటే ఊరంతా ఒక్కటైపోయేది. ఎటు చూసినా హడావుడి. నెలగంట ప్రారంభమైతే చాలు.. మా ఊరికి పండగ వచ్చేసినట్లే.. ఇదిగో ఇలా ప్రతి సంక్రాంతికి ఇంట్లో ఉన్న కంచు సామాన్లన్నీ అందరం కలిసి శుభ్రం చేసేవాళ్లం. ఎదురుపడ్డ ప్రతి మనిషినీ పలకరించే వాళ్లం. కష్టసుఖాలు కలవరించుకునేవాళ్లం. ఇప్పుడంతా చెట్టుకొకరు.. పుట్టకొకరు అయిపోయారు. ధనుర్మాసం రోజుల్లో ప్రతి ఉదయం భజనలతో దైవనామస్మరణతో ఊరు మేలుకొనేది. రెండేళ్ల క్రితం వరకూ భజన సంకీర్తనలు నెల రోజులూ జరిగేవి. ఈసారి ఒక్కరోజే ఉంటుందేమో. అది కూడా భోగీ రోజున చేస్తామని ఊళ్లో వాళ్లంతా చెబుతున్నారు. ఏమోనండీ.. సంక్రాంతి కళ మొత్తం తగ్గిపోయింది.

–ఈ ఏడాది సంక్రాంతి గురించి టి.నగరపాలేనికి చెందిన అప్పచ్చమ్మ వ్యాఖ్యలు.

ఏదీ ఆనాటి సంక్రాంతి?

- పల్లెల్లో కానరాని పండగ సందడి
- పైసల్లేక చిన్నబోతున్న పెద్ద పండగ
- టి.నగరపాలెంలో ఏ గడప తొక్కినా అసంతృప్తే
- కొనుగోళ్లు లేక వ్యాపారులు విలవిల
- వ్యవసాయానికి భరోసా లేదంటున్న రైతులు
- మండుతున్న ధరలతో కొనుగోలు చేసుకోలేని దుస్థితి
- సాక్షి గ్రౌండ్ రిపోర్ట్‌లో వెల్లడైన అంశాలు ఇవీ..

టి.నగరపాలెం పంచాయతీ

- జనాభా 2,700
- వార్డులు 10
- ఓటర్లు 1,600
- రైతు కుటుంబాలు 150
- గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా లబ్ధిదారులు 140
- పాడి రైతులు 100 మంది
- వ్యాపారులు 100 మంది (ఇటుక, మార్బుల్స్, లారీలు, వస్త్ర వ్యాపారులు)
- ఆటో డ్రైవర్లు 85
- కార్పెంటర్లు 30-40 కుటుంబాలు

చేతిలో చిల్లి గవ్వ లేదు..

గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా వచ్చేది. పెట్టుబడి సాయం అందేది. ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు అన్నీ అందుబాటులో ఉండేవి. వ్యవసాయం అంటే పండగలా చేసుకునేవాళ్లం. ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి సాయం అంద లేదు. సొంత పెట్టుబడి పెట్టుకోవాల్సి వస్తోంది. రూ.3, రూ.5లకు వడ్డీకి డబ్బులు తీసుకొని పంటలేసుకుంటున్నాం. ఆ వడ్డీలు తీర్చడానికి కూలి పనులకు కూడా వెళ్లాల్సి వస్తోంది. చేతిలో చిల్లి గవ్వ లేదు. ఇంకేమి పెద్ద పండగ చేసుకుంటాం.

–మొల్లి పెంటయ్య, రైతు





టి.నగరపాలెం గ్రామం

సాక్షి, విశాఖపట్నం: ప్రతి ఇంటికీ కాంతులు తీసుకొచ్చే సంక్రాంతి పండగలో క్రాంతి కనుమరుగైంది. నేడు గడిచి రేపు పొద్దు పొడిచినట్టు... ఆటపాటలతో, ఆప్యాయత మాటలతో అందరూ ఒకచోట చేరి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి కళ తప్పింది. పల్లె వాకిట ఆనందాన్ని నింపే పర్వదినాన్ని.. సంప్రదాయాన్ని విడిచిపెట్టలేక.. ఏదో కానిచ్చేద్దాం అనేటట్లుగా.. చేసుకునే కుటుంబాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. భీమిలి నియోజకవర్గం టి.నగరపాలెం పంచాయతీని పరిశీలిస్తే.. సంక్రాంతి సంబరాలు అటుంచితే.. ఏ గడప తట్టినా.. మౌనమే పండగ చేసుకుంటోంది. ఏ వీధికి వెళ్లినా ఆవేదనే ఆశల పతంగులు ఎగరేసుకుంటోంది.

ఏముందని పండగ చేసుకోవాలి?

ఒకప్పుడు ఏ ఊరికి ఆ ఊరే స్వయంపోషకం. ఊరందరి అవసరాలను ఊరే తీర్చేది. రైతులు పంట చేతికొచ్చి.. దాని ద్వారా వచ్చిన ఆదాయంతో పండగ చేసుకునేవాళ్లు. నేతన్న ఇంట తీరిక లేకుండా మగ్గం నడిచేది. పండక్కి ఊర్లో సింగారించుకునే ప్రతి కోకా.. ఆ ఊరే నేసేది. ప్రతి పంచే అక్కడే హుందాగా తయారయ్యేది. కులవృత్తులకు కూడు పెట్టేది. పండక్కి ఊరి సాంస్కృతిక సందడిని ఊరే సమకూర్చుకునేది. కొనుగోళ్లు, అమ్మకాలతో.. ప్రతి ఇంట్లో పండగ జరిగేది. కానీ.. కాలం మారింది. క్రమంగా పంటల దిగుబడి తగ్గిపోయింది. పెట్టుబడి పెరిగిపోయింది. కులవృత్తులు కనుమరుగైపోయాయి. రెడీమేడ్ రాజ్యమేలుతుంటే నేతన్న నీరసించిపోయాడు. ఇలాంటి సమయంలోనే ప్రభుత్వాలు ఆదుకునేవి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతన్నకు 'భరోసా' కల్పించి.. పెట్టుబడి సాయమందించింది. కులవృత్తులకు 'ఆసరా' ఇచ్చింది. మహిళలకు ఆర్థిక 'చేయూత' నందించింది. అందుకే.. ఊరందరి అవసరాల్ని ఊరు తీర్చకపోయినా.. సర్కారు సాయంతో సరదాగా గడిపేవారు. పండగకూ ప్రతి ఇల్లూ కళకళలాడేది. ఇప్పుడు ఎవర్ని అడిగినా ఏముందని పండగ చేసుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరికీ అన్నం పెట్టే రైతు సంతోషంగా లేడు. పనులు సరిగా జరగక చేతికి చిల్లిగవ్వ దొరక్క కూలీ కూడా కూలబడిపోయాడు. వ్యాపారాలు లేకపోవడంతో వ్యాపారులు కునారిల్లిపోయారు. మహిళల్లోనూ ఆనందం కనిపించడం లేదు. అన్ని రంగాల ప్రజలూ అస్తవ్యస్త జీవనంలోకి నెట్టేసినట్లుగా మారిపోయారు. ఫలితంగా అసలైన సంక్రాంతి పండగ టి.నగరపాలెంలో ఎక్కడా కనిపించడం లేదు.

సందడే లేదయ్యా..

సంక్రాంతి పండగంటే మా ఊళ్లో హడావుడి ఉండేది. పిల్లలు, చుట్టాలు భోగి పండగకు రెండు రోజుల ముందే వచ్చేసేవాళ్లు. ఈ పాటికి మా ఇంట్లో మా తాహతు కొద్దీ పిండి వంటలు చేసుకునేవాళ్లం. ఇప్పుడు సందడే లేదయ్యా. చూశారు కదా.. ఊరంతా బోసిపోయినట్లు ఉంది. ఏదైనా కొందామంటే.. ధరలు ఆకాశాన్ని తాకాయి. ఎవరి దగ్గరా డబ్బులు లేవు. ఇంక పండగలేం చేసుకుంటాం.

–కశింకోట సింహాచలం, వృద్ధురాలు



మనీ రొటేషన్ జరగడం లేదు

గతేడాది వరకూ మా ఊరిలో సంక్రాంతి అంటే హడావుడి ఉండేది. ధనుర్మాసంలో భజనలు చేసేవాళ్లం. ఆర్థికంగా లేని వారు కూడా హాయిగా ఉండేవారు. ఎందుకంటే గత ప్రభుత్వం హయాంలో ఆర్థికంగా చేయూత అందేది. ఏదో ఒక పథకం రూపంలో ప్రజలకు డబ్బులు వచ్చేవి. వారి జీవనం సాఫీగా సాగేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ పథకం అందలేదు. మనీ రొటేషన్ జరగడం లేదు. అందుకే.. అన్ని రకాల వ్యాపారాలు డల్ అయిపోయాయి. ఫ్రీ ఇసుక అనే ఒక్క దానితో నిర్మాణ రంగం అస్తవ్యస్తంగా మారిపోయింది. దీనికి అనుబంధంగా ఉండే మా మార్బుల్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. నిర్మాణాలు జరిగితే కదా.. మాకు వ్యాపారాలు జరిగేవి. అందుకే సంక్రాంతి ఏదో అలా గడిచిపోతోంది.

–తమ్మిన నరేంద్ర, మార్బుల్ వ్యాపారి



పథకాలతోనే పండగ చేసుకోనేవాళ్లం

ఒకప్పుడు కూలి పనులకు వెళ్లేదాన్ని. నాకు ఏడేళ్ల క్రితం కాలికి ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ఇంటి భారమంతా మా ఆయన కూలి డబ్బులు మీదే నడిచేది. గత ఐదేళ్లలో మాకు అమ్మ ఒడి వచ్చింది. డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ డబ్బులు కూడా వచ్చాయి. వీటితోనే ఇల్లు గడిచిపోయేది. పండగలు జరిగేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. చేతిలో డబ్బులు లేవు. ఏం చేయాలో ఇప్పటికీ అర్థం కావడం లేదు.

– లక్ష్మి సోమి, ఎస్సీ కాలనీ





భక్తిశ్రద్ధలతో నృసింహ దీక్షల విరమణ



తిరుముడులతో కొండదిగువ నుంచి సింహగిరికి వెళ్తున్న దీక్షధారులు

సింహాచలం: సింహగిరిపై మాలధారులు శ్రీ నృసింహ దీక్షలు ఆదివారం విరమించారు. 41 రోజుల మండల దీక్ష, 32 రోజుల దీక్ష ధారులంతా శిరస్సుపై తిరుముడులను పెట్టుకొని సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి వాటిని సమర్పించి దీక్ష విరమించారు. వారికి ఉచితంగా అంతరాలయ దర్శనాన్ని దేవస్థానం కల్పించింది. అనంతరం శ్రీగోకులంకి సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద వైదికులు దీక్ష ధారులందరిచేత శాస్త్రోక్తంగా దీక్ష విరమింపజేశారు. సింహాచలానికి చెందిన చందన పెరుమాళ్ పీఠం గురుస్వామి సానబోయిన రాజు, సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్ర, శ్రీనృసింహ పెరుమాళ్ పీఠం గురుస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దీక్షధారులు హరినామస్మరణలు చేసుకుంటూ తిరుముడిలతో సింహగిరికి తరలివెళ్లారు.

శ్రీనృసింహ హోమం, శాంతి కల్యాణం

శ్రీనృసింహ దీక్షల విరమణను పురస్కరించుకుని ఆలయ కల్యాణమండపంలో శ్రీనృసింహ హోమాన్ని నిర్వహించారు. మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ జరిపారు. స్వామివారి శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుముడులతో సుభద్రా కాంప్లెక్స్‌లో నుంచి అంతరాలయంలోకి వెళ్లే దీక్షధారులందరినీ కల్యాణమండపం మీదుగా పంపించి శ్రీనృసింహ హోమం, శాంతి కల్యాణం తిలకించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.



కుంభప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో త్రినాథరావు

15న అప్పన్న మకరవేట ఉత్సవం

సింహాచలం: కనుమ పండగను పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి మకరవేట(గజేంద్రమోక్షం) ఉత్సవం కొండదిగువ పూలతోటలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వరదరాజస్వామి అలంకరణ చేసి బుధవారం సాయంత్రం కొండదిగువకి మెట్లమార్గం ద్వారా తీసుకొస్తారు. కొండదిగువ ఉన్న పూలతోటలోని ప్రధాన మండపంలో స్వామిని వేంజేంచేసి గజేంద్రమోక్షం ఉత్సవాన్ని నిర్వహిస్తారు. స్వామికి విశేష పూజలు చేస్తారు. అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్టిస్తారు. తరువాత అడవివరం గ్రామ పురవీధుల్లో గజవాహనంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోట ముస్తాబు చేశారు. కాగా గజేంద్రమోక్షం ఉత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపై స్వామివారి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయి.



ఉత్సవం జరిగే పూలతోట వ్యూ

నేడు సంక్రాంతి సంబరాలు

సింహగిరిపై సోమవారం ఉదయం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో ఉదయం పెద్ద ఎత్తున భోగి మంటను వేయనున్నారు. అలాగే గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జంగమ దేవర, కొమ్మదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, కపిల గిత్త, ఎడ్లబండి, పూరిగుడెసల ప్రదర్శనలు కనువిందు చేయనున్నాయి. ఉదయం 9 గంటలకు చిన్నారులకు సామూహికంగా భోగిపళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

17 నుంచి కళాభారతిలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాభారతి ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం: త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 23 వరకు త్యాగరాజ ఆరాధనోత్సవాలు కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నామని ట్రస్ట్ ప్రతినిధులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్మాలూరి రాంబాబు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది 7 రోజులపాటు నిర్వహించడానికి ఏర్పాట్లుచేశామని చెప్పారు. ఈ ఏడాదికిగాను ప్రతిష్టాత్మక సంగీత కళాభారతి అవార్డును నాదస్వర విద్వాంసుడు గురువిల్లి అప్పన్నకు ఇవ్వనున్నామన్నారు. వారం రోజులపాటు 404 సంగీత కచేరీలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి పంతులు గోపాలరావు, ట్రస్టీలు పైడా కృష్ణప్రసాద్, మల్లిక గ్రంధి పాల్గొన్నారు.

400 ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ

డాబాగార్డెన్స్: సంక్రాంతి పండక్కి ద్వారకాబస్‌స్టేషన్ నుంచి 400 ప్రత్యేక సర్వీసులు నడిపినట్టు ప్రాంతీయ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. నాలుగు రోజులుగా హైదరాబాద్‌కు 25, విజయవాడకు 40 బస్సులు నడపగా, ఆదివారం శ్రీకాకుళం 100, రాజమండ్రికి 20, కాకినాడకు 20, పార్వతీపురానికి 40, పలాసకు 30, సాలూరుకు 30తో పాటు రద్దీ ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడిపినట్టు చెప్పారు. భోగి రోజు కూడా ప్రత్యేక సర్వీసులు రద్దీకి అనుగుణంగా నడపనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఇతర భాషలపై కూడా పట్టు అవసరం


సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ



మాట్లాడుతున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ

సబ్బవరం: న్యాయ విద్యార్థులు ఇతర భాషలపై కూడా పట్టుసాధించాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విజిటర్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ సూచించారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. విశ్వవిద్యాలయంలోని అన్ని భవనాలతో పాటు గ్రంథాలయాన్ని సందర్శించారు. అనంతరం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని రాజ్యాంగ పీఠికలోని 'మన కోసం మనం రూపొందించుకున్న రాజ్యాంగం' అనే అంశంపై ప్రసంగించారు. తెలుగు విద్యార్థులు సైతం ఇతర భాషలపై పట్టు సాధించాలన్నారు. కొత్త భాష నేర్చుకోవడం అంటే కొత్త విజ్ఞానాన్ని, ప్రవీణ్యాన్ని సంపాదించుకోవడమేనని సూచించారు. న్యాయ విద్యార్థులంతా లక్ష్యాలను చేరుకుని చదువుకున్న విశ్వవిద్యాలయానికి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్, చీఫ్ వార్డెన్ భాగ్యలక్ష్మి, జోగినాయుడు పాల్గొన్నారు.

జీవీఎంసీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



జీవీఎంసీ కార్యాలయంలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

డాబాగార్డెన్స్: ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం ఆదివారం జీవీఎంసీని సందర్శించింది. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు నగరంలో అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల పనితీరును అధికారులు వారికి వివరించారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరం, మేయర్, కమిషనర్ చాంబర్లను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు లభిస్తున్న సింగిల్ డిజిట్ ర్యాంక్‌లు, సాధించిన అవార్డులను ట్రైనీ ఐఏఎస్‌లకు జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాదరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవి, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఎస్ఆర్‌యూ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస రాజమణి వివరించినట్టు అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తెలిపారు. అనంతరం వీఎంఆర్‌డీఏ చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సంస్థ అధికారి శ్రీనివాస్ రాజమణి వివరించారు.

శభాష్ బాల



మల్లకంభంపై విద్యార్థుల ప్రదర్శన



బైక్ జంపింగ్



ద్విచక్రవాహనంపై విన్యాసాలు



ద్విచక్రవాహనంపై ఎగురుతూ గాల్లో ట్యూబ్ లైట్లు పగలగొడుతున్న రాముదీక్షిత్

ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞానవిహార పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఒళ్లు గగుర్పాటుకు గురిచేసే సాహస విన్యాసాలను విద్యార్థులు ప్రదర్శించారు. బాలురతో సమానంగా బాలికలు మల్లకంభంపై విన్యాసాలు, ద్విచక్రవాహనాలతో సాహసాలు, రోప్ డైవ్‌లు, ద్విచక్రవాహనాలు నడుపుతూ ఆసనాలు, గాలిలో దూకడం, అగ్ని చక్రంలో నుంచి దూసుకుపోవడం, ట్యూబ్‌లైట్లతో సాహసాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. విద్యార్థులలో రామదీక్షిత్, ప్రణయ్, హర్షవర్ధన్, విద్యాధరి, కావ్య, సాయిగీత, కార్తీక్ విన్యాసాలు విశేషంగా అలరించాయి.

-తగరపువలస



బాలికల విన్యాసం



కాళ్లతో ద్విచక్రవాహనం నడుపుతున్న విద్యార్థిని



అగ్నిగోళం నుంచి దూకుతున్న విద్యార్థి

కొబ్బరి పంట పండింది...

బండి నిండింది





ఏయూక్యాంపస్ : కొబ్బరి పంట పండింది.. ట్రాక్టర్ నిండింది. అడ్డురోడ్డు జంక్షన్ వద్ద ఈ చిత్రాలు 'సాక్షి'కి కనిపించాయి. అడ్డురోడ్డు పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వందల ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. రైతుల నుంచి కొబ్బరి కొనుగోలు చేయడం, వొలిచి కొబ్బరి కాయలు మార్కెట్‌కు తరలించడం ఇక్కడ వ్యాపారులు నిత్యం చేస్తుంటారు. కొబ్బరిలో కాయలు, పైన ఉండే తొక్కను సైతం వేర్వేరుగా విక్రయిస్తారు. కొబ్బరి తొక్కతో ప్రత్యేకంగా తాళ్లు తయారు చేయడం, పరుపులకు అవసరమైన కొబ్బరి పీచును సరఫరా చేసే సంస్థలు ఇక్కడ విరివిగా ఉన్నాయి. ఒక ట్రాక్టర్‌లో చెట్టునుంచి దింపిన కొబ్బరి కాయలు తీసుకువెళుతుంటే మరొక ట్రాక్టర్‌లో కొబ్బరి తొక్కనుతీసుకు వెళుతున్నారు. నిత్యం ఈ మార్గంలో ఇటువంటి దృశ్యాలు కనిపిస్తుంటాయి.

–ఫొటోలు : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

కలర్‌ఫుల్ కైట్స్



సంక్రాంతి పండగ అంటే కేవలం భోగి మంటలు, కొత్త దుస్తులు, పిండి వంటలు, ఆటపాటలే కాకుండా గాలిపటాలు కూడా గుర్తుకు వస్తాయి. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ గాలి పటాలు ఎగుర వేయడానికి ఇష్టపడతారు. ఆర్కే బీచ్‌లో ఆదివారం రంగురంగుల గాలిపటాలు రయ్‌రయ్‌మంటూ ఎగిరాయి. ఒకరికొకరు పోటీ పడి పతంగులు ఎగురవేశారు. –ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

జనదాంబ



సంక్రాంతి పండగ నేపథ్యంలో వస్త్ర దుకాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే జగదాంబ కూడలిలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన నగరవాసులతో షాపింగ్ మాళ్లు కిక్కిరిసిపోయాయి.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఘనంగా విజ్ఞాన విహార వార్షికోత్సవం



సాహస క్రీడలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు

తగరపువలస: దేశంలోని వివిధ విద్యాసంస్థలకు భిన్నంగా మార్కుల కోసం కాకుండా భక్తులను అందించే విద్యాసంస్థ విజ్ఞాన విహార అని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు తెలిపారు. ఆదివారం ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార 45వ వార్షికోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులలో ధైర్యసాహసాలు నింపుతూ ప్రత్యేకశిక్షణ ఇస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ వంటి వారి ఆశయాలు సాధించే యువత ఈ దేశానికి అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యాభారతి అధ్యక్షుడు పీవీ నారాయణరావు, బీజేపీ శాసనసభ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, ఎన్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ జీవీ కృష్ణకుమార్, అగర్తల సెంట్రల్ విశ్వవిద్యాలయం ఉప కులపతి గంగాప్రసాద్ ప్రసేన్, విద్యాభారతి అఖిలభారత అధ్యక్షుడు దూసి రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ జి.రామకృష్ణ, కార్యదర్శి జి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథరాజు తదితరులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందించారు.

తీరంలో బోటు బోల్తా

రూ.15 లక్షల ఆస్తి నష్టం



సముద్రంలో మునిగిన బోటు

కొమ్మాది : మంగమారిపేట బీచ్‌లో ఇంజిన్ బోటు బోల్తా పడింది. బోటు యజమాని సూరాడ హరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం శనివారం తన ఇంజిన్ బోటులో 20 మందితో వేటకు వెళ్లి.. తిరిగొచ్చి తీరంలో లంగరు వేసి ఉంచామన్నారు. ఆదివారం తెల్లవారు జామున వేటకు వెళ్లేందుకు తీరప్రాంతానికి వచ్చేసరికి కిలోమీటరు దూరంలో బోటు బోల్తా పడి ఉందని, వెంటనే తనతోపాటు వచ్చినవారంతా కలిసి మూడు బోట్ల సాయంతో తాళ్లు కట్టి తీరానికి తీసుకొచ్చామన్నారు. తీరంలో బలమైన ఈదురు గాలులు ప్రభావంతోనే బోటు బోల్తా పడిందని, వీటి వలన వలలు, బోటు కొంత మేర దెబ్బతిన్నాయని, సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని హరిబాబు తెలిపాడు.

వీఆర్‌ఎస్‌పై భగ్గుమన్న కార్మిక లోకం

- జీవో కాపీలను దహనం చేసిన నాయకులు



గాజువాకలో వీఆర్ఎస్ జీవో కాపీలను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



జీవీఎంసీ గాంధీ పార్కులో జీవో కాపీలను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్)పై కార్మిక సంఘాలు భగ్గుమన్నాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జోవోను నిరసిస్తూ ఆందోళన నిర్వహించాయి. ఇటీవల విశాఖ వచ్చిన మోదీ స్టీల్‌ప్లాంట్‌పై ఎటువంటి ప్రకటన చేయకపోగా..ఆయన వెళ్లిన వెంటనే రాత్రికిరాత్రి వీఆర్ఎస్ జీవో విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా గాజువాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీఆర్ఎస్ జీవో కాపీలను భోగిమంటల్లో వేసి సీపీఎం నేతలు తగులబెట్టారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నడం దుర్మార్గమన్నారు. ఇటీవల విశాఖ వచ్చిన ప్రధానమంత్రి వద్ద ఈ విషయంపై చంద్రబాబు పవన్ కల్యాణ్ కనీసం ప్రస్తావించకపోవడం విచారకరమన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఈ ప్లాంట్‌ను అదాని, అంబాలనీలకు కట్టబెట్టడం కోసం బీజేపీ ప్రభుత్వం అనేక ప్రయత్నాలను చేస్తోందన్నారు. అందులో భాగంగానే ఉద్యోగులను ఇంటికి పంపించేందుకు వీఆర్ఎస్‌ను ప్రవేశపెడుతోందన్నారు.కార్యక్రమంలో ఎం.రాంబాబు, నాయకులు శ్రీనివాస రాజు, కె.ఎం.శ్రీనివాస్, నూకేశ్వరరావు, డి.రమణ, గొలగాని అప్పారావు, జి.లక్ష్మి, సరోజిని, వై.టి. దాసు, గురప్ప, డి.వెంకటరావు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల తొలగింపు తగదు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను బలవంతంగా తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వలంటరీ రిటైర్మెంట్ స్కీంను తక్షణమే నిలిపివేయాలని చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న జేఏసీ దీక్షా శిబిరంలో ఆదివారం విశాఖ డెయిరీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వీఆర్ఎస్ జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏడు వేల మందిని చేర్చుకునే అవకాశం ఉన్నా..ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి పూనుకోవడం తగదన్నారు. కేంద్రం కుట్రలకు పాల్పడుతున్న స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.రమణ, అధ్యక్షుడు కె.వరహామూర్తి, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, విశాఖ డెయిరీ నాయకులు వి.నారాయణ, డి.నాగమణి బాబూ, జి.నాగేశ్వరరావు, యు.శ్రీనివాసరావు, బి.కోటేశ్వరరావు, డి.లక్ష్మి, ఎల్‌వీఎం నాయుడు, అనసూయ, ఇంద్ర, విజయ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి



వేదికపై నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖ విద్య: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి సూచించారు. ఆంధ్రయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం ఆర్థిక నేరాలు–తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీ మాట్లాడుతూ అక్రమ, అనైతిక పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు బరితెగించి అడ్డదారుల్లో బ్యాంకు వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారని, ఈ విషయంలో వినియోగదారులు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆకర్షణీయమైన ఉద్యోగాల ఆశతో యువతను విదేశాలకు తీసుకెళ్తున్నారని, వారికి శిక్షణ ఇచ్చి సైబర్ నేరాలకు పాల్పడేలా బలవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ సైబర్ నేరాలు ఆర్థిక ఉగ్రవాదానికి కొత్త రూపంగా ఉద్భవిస్తున్నాయని, విద్యావంతులు కూడా ఈ నేరానికి బాధితులుగా మారుతున్నారన్నారు. ఆర్‌బీఐ ఏపీ ప్రాంతీయ డైరెక్టర్ ఏవో బషీర్ ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడానికి, సైబర్ నేరాలను నియంత్రించడానికి ఆర్‌బీఐ తీసుకున్న విస్తృత చర్యలను వివరించారు. ఎస్‌బీఐ, ఎస్ఐబీఐ, నాబార్డ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి వివిధ బ్యాంకుల సీనియర్ అధికారులు తమ అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మహనా, చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పాటిల్, స్మాల్ ఇండస్ట్రీస్ డెవెలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం వి.చంద్ర మౌళి, నాబార్డు డీజీఎం ఎంఎస్ఆర్‌సీ మూర్తి, యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ జీఎం షాలిని మీనన్, బ్యాంకు ఆఫ్ ఇండియా జెడ్ఎం ఎస్. సీతారాం, సెంట్రల్ బ్యాంకు చీఫ్ మేనేజర్ అదిల్ రెహ్మాన్, ఎల్ఐసీ సీనియర్ డీఆర్ఎం ఎస్‌పీ.దాస్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఆర్ఎం బిజయ కేతన్ సాహూ తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ విషాదం

- సంక్రాంతికి కుమారుడు ఇంటికి వచ్చి మృతి



రక్తపు మడుగులో మృతురాలు సుధ

మధురవాడ: పండగవేళ ఆ కుటుంబంలో విషాదం నెలకుంది. మేడ పైనుంచి పడి వివాహిత మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది. పీఎంపాలెం ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు.. విజయవాడ సత్యనారాయణపురంలోని ఓగిరాల వీధికి చెందిన కొంజేటి వేణుగోపాల కృష్ణమూర్తి, భార్య సుధ పండగ నేపథ్యంలో విశాఖలోని మధురవాడ ఐటీ సెజ్ సమీపంలో వుడా హరిత అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న పెద్ద కుమారుడు వెంకట్ సాయిసందీప్ ఇంటికి శుక్రవారం వచ్చారు. సందీప్ గీతం వైద్య కళాశాలలో ఎనస్తీషియన్‌గా పనిచేస్తున్నాడు. సుధకు బీపీ, థైరాయిడ్, షుగర్‌తో పాటు మోకాలి నొప్పులు కూడా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో తన భార్యకు ఇన్సులిన్ ఇవ్వాలని వెతకగా..ఇంట్లో కనిపించలేదు. బయటకు వచ్చి చూడగా రక్తపు మడుగులో సుధ కనిపించింది. ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు ఫోన్ చేయగా..వారొచ్చి పరీక్షించారు. అప్పటికే సుధ మృతి చెందినట్టు వైద్య సిబ్బంది నిర్ధారించారు. కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ పైకి వెళ్లగా.. కళ్లు తిరిగి పడిపోయి ఉంటుందని, ఆమె మృతిపై ఎటువంటి అనుమానాలు కృష్ణమూర్తి ఫిర్యాదులో పేర్కొనలేదని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

నిధులకు కట కట!

- సంక్షేమం ఊసేలేదు
- అన్ని చెల్లింపులకు బ్రేక్
- కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని పరిస్థితి
- రెండోసారి బిల్లులు పెడితే చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక
- అలా చేసినందుకు ఇప్పటికే ఒకరిపై వేటు



కలెక్టరేట్

మహారాణిపేట: అమ్మ ఒడి లేదు.. రైతు భరోసా ఇవ్వలేదు.. 19 నుంచి 59 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1500 ఊసేలేదు.. ఇలా ఒక్క సంక్షేమ పథకం అమలు చేయడం లేదు. మరోవైపు రాష్ట్ర ఖజానా నింపుకోడానికి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. విద్యుత్ చార్జీలు భారీగా పెంచేశారు. త్వరలోనే రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి. ఇప్పటికే నిత్యావసర ధరలు భగ్గుమంటున్నాయి. రాష్ట్ర ఖజానాకు ఆదాయం తప్పా.. ఖర్చు లేదు. అయినప్పటికీ ఉద్యోగులకు గానీ, కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు విషయంలో కోతలు విధించడం గమనార్హం. ఉద్యోగుల జీతాలు, పింఛన్లు మినహా మిగిలిన అన్ని బిల్లులకు బ్రేక్ వేశారు. ఇందుకు సంబంధించి ఖజానా శాఖకు ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది.

రెండోసారి బిల్లులు సమర్పిస్తే చర్యలు

పలు ప్రభుత్వ శాఖలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో అన్ని రకాల బిల్లులను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఫలితంగా ఉద్యోగులకు సంబంధించిన బిల్లులతో పాటు కాంట్రాక్టు బిల్లులను నిలిపివేస్తున్నారు. ఒకవేళ బిల్లు కోసం రెండోసారి సమర్పిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తుండడం గమనార్హం. ఇలా రెండోసారి బిల్లు సమర్పించిన పాపానికి పాడేరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్ బెనర్జీపై ఇటీవల వేటు వేశారు. ఆర్థిక సంవత్సరం మరో మూడు నెలలు ఉండగానే నిధులు రాక అనేక ప్రభుత్వ శాఖలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి.

నిర్వహణ ఖర్చుల భారం..



జిల్లాలో 32 డిపార్టుమెంట్లలో టెలిఫోన్, విద్యుత్, స్టేషనరీ బిల్లులు, ఇతర చెల్లింపులు కూడా బంద్ అయ్యాయి. అలాగే నిర్వహణ ఖర్చులూ భారంగా మారాయి. పలు శాఖల అధికారులు, ఉద్యోగులకు ఇచ్చే రవాణా భత్యం (టీఏ,డీఏ)లు, జీపీఎఫ్ బిల్లు, రిటైర్‌మెంటు బెనిఫిట్స్ కూడా నిలిపివేశారు. గతంలో అయితే ప్రభుత్వ శాఖలు ఇచ్చే బిల్లులను ట్రెజరీ శాఖ సిబ్బంది వాటిని సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లోని అప్‌లోడ్ చేశారు. కాని ఇప్పుడు అప్‌లోడ్ చేయడానికి వెనుకాడుతున్నారు. హుకుంపేట ఎంఈవో వినతి మేరకు పాడేరు సబ్ ట్రెజరీ సిబ్బంది జీపీఎఫ్ బిల్లును రెండో సారి సమర్పించారు. దీనిపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెండోసారి ఎందుకు సమర్పించారని సంబంధిత ఉద్యోగి బెనర్జీపై వేటు వేసి ఎస్‌టీవో రమేష్‌కు షోకాజ్ నోటీసులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వశాఖల్లో పలు అభివృద్ధి పనులు,సరక్షేమ పతకాల్లో ప్రత్యక్షంగా,పరోక్షంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులు కూడా పెండింగ్‌లో పడ్డాయి. బిల్లులన్నీ సంబంధిత శాఖ ద్వారా సీఎఫ్ఎంఎస్‌కు వెళుతున్నాయి. అక్కడ అన్ని చెల్లింపులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. దీంతో సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

పండగలో జాగ్రత్తలు పాటించండి

- ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేసుకోండి
- పేకాట, కోడిపందాలు చట్టరీత్యా నేరం
- పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం : సంక్రాంతి పండగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ప్రయాణాలపై వెళ్లేవారు వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని, ఇళ్లకు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇంటి బయట చెత్త, పాలు ప్యాకెట్లు, పత్రికలు వంటివి వదిలిపెట్టడం వల్ల ఇంట్లో ఎవరూ లేరని సూచిస్తాయన్నారు. తలుపులు పరదాలతో కప్పి ఇంట్లో ఎవరైనా ఉన్నారని భావించేందుకు కొంత వెలుతురు ఆన్‌లో ఉంచాలన్నారు.

- ప్రయాణాలపై వెళ్లేటప్పుడు ఇళ్ల ముందు వాహనాలకు తాళం వేయడంతోపాటు చైన్‌లతో బంధించాలి. విశ్వసనీయమైన వాచ్‌మెన్‌ను లేదా భద్రతా సిబ్బందిని నియమించాలి.
- కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- గాలిపటాలను కరెంట్ వైర్లకు దూరంగా ఎగరవేయాలి.
- కోడి పందాలు, పేకాట, గుండాట చట్టరీత్యా నేరం. ఒక వేళ ఎవరైనా నిర్వహిస్తే చర్యలు తప్పవు. అటువంటివి ప్రజల దృష్టికి వస్తే 112 లేదా సిటీ పోలీసు కమిషనర్ నెంబర్ 7995095799 లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలి.
- భోగి మంటలు వేసేటప్పుడు పిల్లలు జాగ్రత్తగా ఉండాలి. పిల్లలను పెద్దలు పర్యవేక్షణ చేయాలి. భోగి మంటలు ప్రజలు ఉండే ప్రదేశాలకు, మండే స్వభావం గల పదార్థాలకు దూరంగా నిర్వహించాలి. భోగి మంటల్లో ప్లాస్టిక్, బాణసంచా మొదలైన నిషేధిత పదార్థాలు వేయరాదు.
- చర్చిలు, మసీదులపై రంగుల వేయరాదు. వాటికి దగ్గరలో డ్రమ్స్ వాయించడం, ఈలలు వేయడం చేయరాదు.

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత



లావణ్య కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి అనిత, టీటీడీ బోర్డు సభ్యులు

సీతంపేట: తిరుపతి తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన సూరిశెట్టి లావణ్య కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, టీటీడీ బోర్డు మెంబర్లు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, టీడీపీ నగర అధ్యక్షుడు గండి బాబ్జి, వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ, టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ పాల్గొన్నారు.

కంచరపాలెంలోని ఇందిరానగర్‌లో కండిపిల్లి శాంతి కుటుంబానికి రూ.25 లక్షల చెక్కును హోం మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ అందజేశారు. మృతురాలి భర్త వెంకటేష్, కుమారుడు వరప్రసాద్‌లను ఓదార్చి అండగా ఉంటామని చెప్పారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.79,640
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,000
వెండి(కిలో):	రూ.1,01,000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	:రూ.122
స్కిన్	:రూ.214
స్కిన్‌లెస్	:రూ.224

తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన తనయ



కన్న తండ్రికి తలకొరివి పెడుతున్న లక్ష్మి

మల్కాపురం : మృతి చెందిన కన్నతండ్రికి కూతురు తలకొరివి పెట్టిన ఘటన మల్కాపురంలో జరిగింది. గాంధీజీవీధికి చెందిన చొప్పా సూరిబాబు (60) అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. ఆయనకు కుమారులు లేకపోవటం, అల్లుళ్లు ముందుకు రాకపోవడంతో దుఃఖాన్ని దిగమింగుకొని కన్నకూతురే దహన సంస్కరాలు నిర్వహించింది. ఈ హృదయ విదారక ఘటన పలువురిని కంటతడి పెట్టించింది. ఆర్టీసీ అద్దె బస్సుకు సూరిబాబు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు న్నారు. పెద్ద కుమార్తె లక్ష్మి తండ్రికి అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది.

జనవిహారి



చాపరాయి వద్ద పర్యాటకుల సందడి

ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలవిహారికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ ప్రకృతి అందాల మధ్య ఉల్లాసంగా గడిపారు. థింసా నృత్యం చేస్తూ గిరిజన కళాకారులు పర్యాటకులను అలరించారు. ఇక్కడికి సమీప అంజోడలో అటవీశాఖ ఏర్పాటుచేసిన అరకు పైనరీ కూడా సందర్శకులతో కళకళలాడింది. సంక్రాంతి సెలవులతో వీకెండ్ కావడంతో కొద్దిరోజులుగా తాకిడి నెలకొంది.

– డుంబ్రిగుడ



గిరిజన మహిళ వస్త్రధారణలో పర్యాటకులు



భారీగా తరలివచ్చిన పర్యాటకులు

కొత్తపల్లి కళకళ..



కొత్తపల్లి జలపాతానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. వ్యూపాయింట్, జలపాతం వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని ఉత్సాహంగా గడిపారు చీకులు, బొంగు చికెన్ భారీగా అమ్మకాలు జరిగాయి. – జి.మాడుగుల



గిరిజనులతో కలిసి పర్యాటకుల థింసా నృత్యం

బెస్ట్‌గా రక్షణ్, రచిత్, జగదీష్

విశాఖ స్పోర్ట్స్: డీఎస్ఆర్ ట్రోఫీలో రక్షణ్, రచిత్, జగదీష్‌లు బెస్ట్‌లుగా నిలిచారు. ఆదివారంతో ముగిసిన ఈ ట్రోఫీలో జగదీష్ యాదవ్ 120 పరుగులతో పాటు పదిమందిని పెవిలియన్‌కు పంపి బెస్ట్ ఆల్ రౌండర్‌గా నిలిచాడు. ఐదు మ్యాచ్‌లాడి 229 పరుగులు చేసిన రక్షణ్ బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా నిలవగా... పిడి రచిత్ పదమూడు వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా నిలిచాడు. వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పీఎంపాలెం జట్టు నలభై ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. ప్రతిగా ఆశ్రయ సీసీ జట్టు 39.2 ఓవర్లలోనే 233 పరుగులకు ఆలౌటైంది. పీఎంపాలెం జట్టు తరఫున కళ్యప్‌ప్రకాష్ 7 ఫోర్లు 10 సిక్సర్లతో 121 పరుగులు చేసి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. వీడీసీఏ ఉపాధ్యక్షుడు పి.వి.సుధాకర్ విజేతలకు ట్రోఫీలందించగా సంఘం ప్రతినిధులు పార్థసారథి, మౌలీ, భోగేంద్రబాబు, పురుషోత్తం, అప్పారావు, జె.కె.ఎం.రాజు, మణికుమార్, ఎం.ఎస్.కుమార్ పాల్గొన్నారు.